ప్రజాశక్తి
www.prajasakti.com
I

## మేడ్చల్‌లో మిత్సుబిషి తయారీ యూనిట్

- ఏర్పాటు చేయనున్న ఆజాద్ ఇంజినీరింగ్

ప్రజాశక్తి-హైదరాబాద్

ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ ఆజాద్ ఇంజనీరింగ్ మేడ్చల్ జిల్లాలో జపాన్‌కు చెందిన మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కోసం ప్రత్యేక తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఈ కంపెనీ నూతన ప్లాంట్ కోసం 20 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.160 కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ ప్లాంట్‌ను మేడ్చల్ సమీపంలోని తునికిబొల్లారంలో ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేసినట్లు పేర్కొంది.



నిందితుడితో వెళుతున్న బాలిక

## సికింద్రాబాద్‌లో బాలిక కిడ్నాప్.. సిద్దిపేటలో ఆచూకీ

- నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ బాలిక కిడ్నాప్ కావడం కలకలం రేపింది. పోలీసులు వెంటనే అప్రమత్తమై ప్రత్యేక బృందాలతో గాలించగా సిద్దిపేటలో బాలిక ఆచూకీ లభ్యమైంది. మహంకాళి ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఓల్డ్ బోయిగూడకు చెందిన రేణుక ఓ మెస్‌లో పని చేస్తోంది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో రేణుక ఇంట్లో పనిలో నిమగ్నమై ఉండగా ఆమె కుమార్తె కృతిక (8) బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దాంతో రేణుక పోలీసులకు ఫిర్యాదు చేయగా, రంగంలోకి దిగిన పోలీసులు స్థానిక సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. రేణుక పని చేసే మెస్‌లోనే పని చేసే ఓ వ్యక్తితో బాలిక నడుచుకుంటూ వెళ్లడం సీసీ కెమెరాలో కనిపించింది. దాంతో పోలీసులు పది బృందాలుగా విడిపోయి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. బాలికను సిద్దిపేటలో పోలీసులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

### పైసలిచ్చి వచ్చేటోళ్లం కాదు..

# ప్రజల మనస్సుతో గెలిచేటోళ్లం..

- పేదోళ్ల హక్కుల కోసం పోరాడేటోళ్లు కమ్యూనిస్టులు
- మోడీపాలన జాతీయ విపత్తు
- కేరళ కార్మిక శాఖ మంత్రి శివన్‌కుట్టి



సభలో మాట్లాడుతున్న కేరళ మంత్రి శివన్‌కుట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బూర్జువా పార్టీల లాగా ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, ప్రజలకు పైసలు పంచి అధికారంలోకి వచ్చేటోళ్లం కాదు. కార్పొరేట్ల కోసం పనిచేసేటోళ్లం కాదు. పేదోళ్ల హక్కుల కోసం పోరాడేటోళ్లం. ప్రజల మనస్సుతో గెలిచేటోళ్లం. కమ్యూనిస్టులకు, ఇతర పార్టీలకు ఉన్న తేడా అదే' అని కేరళ కార్మిక శాఖ మంత్రి శివన్‌కుట్టి అన్నారు. సిద్దిపేటలోని సున్నం రాజయ్య ప్రాంగణం (డిగ్రీ కళాశాల మైదానం)లో శుక్రవారం సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభ ముగింపు సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేరళలోని తమ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రోజుకూలీ రూ.836 ఇస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలా ఇవ్వడం లేదని చెప్పారు. దేశానికి మోడల్ అని మోడీ చెబుతున్న గుజరాత్‌లో ఇస్తోంది కేవలం రూ.236 మాత్రమేనన్నారు. దేశంలో అచ్చేదిన్ పేదలకు, కార్మికులకు రాలేదనీ, కార్పొరేట్లకు వచ్చిందని విమర్శించారు. కేరళలో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.12,500 ఇస్తుంటే ఉత్తరప్రదేశ్‌లో కేవలం రూ.4,500 మాత్రమే ఇస్తున్నారని ఆ రాష్ట్ర ఎంపి లోక్‌సభలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. స్కీం వర్కర్లను కనీసం కార్మికులుగా గుర్తించని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికకోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నంలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. మోడీ ప్రభుత్వ తీరు వల్ల దేశంలో కోట్లాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, వారిని ఆదుకున్న పాపాన పోలేదని విమర్శించారు. అదే సమయంలో కేరళ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కార్మికులను అతిథి కార్మికులుగా భావించి వారి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని, వారికి ఇళ్లు కట్టిస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ మీడియా అంతా మోడీ చుట్టూ చేరి అబద్ధాలను ప్రచారం చేస్తున్నదనీ, ప్రజా సమస్యలను, వస్తున్న పోరాటాలను ఎక్కడా చూపట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రైల్వే, ఇన్సూరెన్స్, తదితర సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ కార్పొరేట్లకు 35 ఏండ్లకు లీజుకిస్తున్న తీరును వివరించారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ వేగం చేశారనీ, ఇప్పుడు విద్యుత్‌నూ ప్రయివేటుపరం చేసేందుకు పూనుకున్నారని విమర్శించారు.

**ప్రతి రంగంలోనూ కేరళ ముందువరుసలోనే..**

కేరళలోని వామపక్ష ప్రభుత్వం ప్రతి రంగంలోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని శివన్‌కుట్టి చెప్పారు. కరోనా కాలంలో చాలా రాష్ట్రాలకు ఆక్సిజన్ అందజేసిన చరిత్ర ఉందన్నారు. విద్యా, వైద్య రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. అసంఘటిత కార్మికుల కోసం ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి 29 రకాల వెల్ఫేర్ స్కీమ్‌లను అమలు చేస్తున్నామని చెప్పారు. వారికోసం ప్రత్యేకంగా వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేసి 89 రంగాల కార్మికులకు లబ్ది చేకూరుస్తున్నామని చెప్పారు. అందుకే కేరళలో ప్రజలు, కార్మికులు వామపక్షాలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో కచ్చితంగా ప్రతి ఐదేండ్లకోసారి వేతన సవరణ జిఒలు విడుదల చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తుంటే తాము మాత్రం వాటిని కాపాడుకునే నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం హిందూస్తాన్ పేపర్ మిల్లును ప్రయివేటు అప్పగించాలని చూస్తే అడ్డుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం టేకోవర్ చేసుకున్నదన్నారు. ఇలా ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయట్లేదన్నారు. మిగతా ప్రభుత్వాలకు, కమ్యూనిస్టులకు ఉన్న తేడా అదేనని చెప్పారు. అతిథి కార్మికుల కోసం 14 జిల్లాలోనూ ప్రత్యేక ఆవాసాలను ఏర్పాటు చేశామన్నారు. సెక్యూలరిజాన్ని కాపాడే క్రమంలో కేరళ ముందువరుసలో ఉందన్నారు. రాష్ట్రంలోని మూడులక్షల మంది పేదలకు ప్రాధాన్యతాక్రమంలో ఇళ్లు ఇచ్చామని చెప్పారు. విద్యావిధానంలో ఐటెక్ విజన్‌తో దూసుకుపోతున్నామనీ, ప్రతి ఇంటికీ నెట్ సౌకర్యాన్ని కల్పించిన ఘనత తమదేనన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడి పోరాడుతున్న రాష్ట్రాల్లో కేరళ ముందు వరుసలో ఉందన్నారు. కార్మికులంతా సంఘటితమై బిజెపి అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలను, మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**రైతు పోరాట స్ఫూర్తితో కార్మికోద్యమం**
**సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చి మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నెలలు తరబడి పోరాటం చేసి వాటిని వెనక్కి తిప్పికొట్టిన చరిత్ర రైతుల పోరాటానికి ఉందనీ, అదే స్ఫూర్తితో కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో తలపెట్టిన కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల ఐక్య ప్రదర్శన (పార్లమెంట్ మార్చ్) ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో మూడు పెద్ద సమ్మెలు జయప్రదం అయ్యాయని చెప్పారు. మోడీ దేశ ఖజానాను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధ్వంసకర విధానాల ఫలితంగా దేశంలో పోరాటాలు తీవ్రం అవుతున్నాయన్నారు. అయితే, వాటిని సంఘటిత పర్చాల్సిన బాధ్యత సిఐటియుపై ఉందన్నారు.

**లేబర్‌కోడ్‌లు..కార్మికవర్గానికి ఉరితాళ్లు : ఎం సాయిబాబు**

కేంద్రంలోని బిజెపి తీసుకొస్తున్న లేబర్‌కోడ్‌లు కార్మికవర్గానికి ఉరితాళ్లుగా మారబోతున్నాయని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యపోరాటాలకు సిఐటియు బాట వేస్తున్నదన్నారు. మోడీ సర్కారు వచ్చాక నిత్యావసరాల ధరలు పేదలు కొనలేని స్థాయికి ఎగబాకాయని చెబుతూ పలు ఉదహరణలు చెప్పారు. కార్మికుల ఆదాయాలు పెంచకుండా దేశ ఆర్థికవృద్ధి ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నించారు. సంపద సృష్టికర్తలైన కష్టజీవులపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు పన్నుల రాయితీలు, రుణాల మాఫీలు చేయడం దారుణమన్నారు. తెలంగాణ ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ జిఒలను సవరించకుండా జాప్యం చేయడం తగదన్నారు. కేంద్రంలో కొట్లాడుతామని మాటల్లో చెప్పడం కాదపి, బిజెపి విధానాలను రోడ్లెకి ప్రతిఘటించాలని సిఎం కెసిఆర్‌కు సూచించారు. ఆర్‌టిసి, ప్రజారవాణా పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

**కెసిఆర్ కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**
**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**

సిఎం కెసిఆర్ రెండు ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోల్లో రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసంఘటిత కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. వారికి కనీసం గూడైనా లేని పరిస్థితి నెలకొందన్నారు. వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. దాని ఫలితంగానే రాష్ట్రంలో 44 చోట్ల కార్మికులు ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుని పోరాటం సాగిస్తున్నారని చెప్పారు. అయితే, వారిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలు కొనసాగుతున్నదని చెప్పారు. అదే సమయంలో హైదరాబాద్ చుట్టూ వందల ఎకరాలను పారిశ్రామికవేత్తలకు అప్పణంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ మాట్లాడుతూ.. మోడీ సర్కారు ఇస్తాన్న ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, పేదలకు పంచుతానన్న నల్లధనం ఏమైందని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతం ముసుగేసుకుని ప్రజలు తినే తిండిపైనా దాడి చేస్తోందని విమర్శించారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. జనవరి ఆరో తేదీన జరిగే స్కీం వర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలకు నిధులు తగ్గించడంపై ఆందోళన వ్యక్తంచేశారు. యూనియన్లను పెట్టుకోకుండా మోడీ సర్కారు అడ్డుకుంటుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లిఖార్జున్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లోని 73 షెడ్యూల్డ్ పరిశ్రమల జిఒలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, భూపాల్, కె వెంకటేశ్వరరావు, వివిఎస్ రావు, వీరారెడ్డి, కె ఈశ్వర్‌రావు, టి రాజారెడ్డి, కార్యదర్శులు జె వెంకటేశ్, ఎం పద్మశ్రీ, ఎ ముత్యంరావు, జె చంద్రశేఖర్, బి మధు, ఎం వెంకటేశ్, బి మల్లేశ్, కోశాధికారి వంగూరు రాములు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, రైతుసంఘం నాయకులు ఆముదాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

## 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల పరిధిలో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్, మ్యాట్రన్, మహిళా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చే నెల ఆరో తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు అదే నెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు ఉందని వివరించారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1 పోస్టులు ఐదు, అదే శాఖలో గ్రేడ్-2 పోస్టులు 106, ఎస్‌సి అభివృద్ధి శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 (మహిళ) పోస్టులు 70, అదే శాఖలో గ్రేడ్-2 (పురుషులు) పోస్టులు 228, బిసి సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టులు 140, వికలాంగులు, వయోవృద్ధుల శాఖలో వార్డెన్ గ్రేడ్-1 పోస్టులు ఐదు, అదే శాఖలో మ్యాట్రన్ గ్రేడ్-1 పోస్టులు మూడు, వార్డెన్ గ్రేడ్-2 పోస్టులు మూడు, మ్యాట్రన్ గ్రేడ్-2 పోస్టులు రెండు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో మహిళా సూపరింటెండెంట్ పోస్టులు 19 చొప్పున మొత్తం 581 పోస్టులను భర్తీ చేస్తున్నట్టు ప్రకటించారు.

## గ్రూప్ 4 దరఖాస్తుల స్వీకరణ వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-4 ఉద్యోగాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. శుక్రవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తున్నట్లు టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. దరఖాస్తుల కోసం కొత్త తేదీలను వెల్లడించింది. ఈ నెల 30 నుంచి జనవరి 19 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపింది. మొత్తం 25 ప్రభుత్వ విభాగాల పరిధిలో 9,168 పోస్టులను టిఎస్‌పిఎస్‌సి భర్తీ చేయనుంది. గ్రూప్-4 ఉద్యోగాలకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని కమిషన్ అంచనా వేస్తోంది.గ్రూప్-2, 3 పోస్టులకు ఉద్యోగ ప్రకటనలు జారీ చేసేందుకు టిఎస్‌పిఎస్‌సి కసరత్తు పూర్తి చేసింది. గ్రూప్-2, 3 కేటగిరీ పరిధిలోకి మరిన్ని ప్రభుత్వ విభాగాల్లోని పోస్టులను చేర్చడంతో ఆ మేరకు అదనంగా పోస్టులను గుర్తించి, వాటిని ప్రస్తుత ప్రకటనల్లో చేర్చింది.

# టైర్ల కంపెనీల కాలుష్య కుంపటి

- ఆరు గ్రామాల్లో భూగర్భ జలాలు కలిషితం
- నల్లటి టైర్ల పౌడర్‌తో పంటలు నాశనం
- చోద్యం చూస్తున్న పిసిబి అధికారులు
- కంపెనీలను మూసివేయాలని రైతుల ఆందోళనలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టైర్ల కంపెనీలు వెదజల్లే కాలుష్య కుంపటి ఆరు గ్రామాలను ఊపిరాడకుండా చేస్తుంది. కంపెనీల కాలుష్య ప్రభావంతో వేలాది మంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. స్వచ్ఛమైన భూగర్భ జలాలు రసాయనాల వల్ల కలుషితమయ్యాయి. విషవాయువుల వల్ల వాయు కాలుష్యం ఏర్పడింది. ఘాటైన దుర్గంతపు వాసన, టైర్ల నల్లటి పౌడర్, దుమ్ము, ధూళి వల్ల పంటలు పాడైపోతున్నాయి. ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. ఇలాంటి కాలుష్య కారక టైర్ల కంపెనీలను మూసి వేయాలని రైతులు, ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న టైర్ల కంపెనీలు పర్యావరణానికి ప్రమాదం తెచ్చిపెడుతు న్నాయి. కొండాపూర్ మండలంలో 11 టైర్ల కంపెనీలున్నాయి. మల్లెపల్లి గ్రామ శివారులో ఉన్న కంపెనీలు నిత్యం వెదజల్లుతున్న పొగ, నల్లటి పౌడర్, దుమ్ము వల్ల చుట్టుపక్కల గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కాయి. పాత టైర్లను కంపెనీల్లో బాయిల్డ్ చేస్తారు. అందులోంచి డాంబర్ అయిల్, పౌడర్, ఇనుప సువ్వ తీస్తారు. టైర్లను బాయిల్డ్ చేయడం వల్ల దుర్గంతమైన, ఘాటైన వాసన వస్తుంది. నల్లటి పౌడర్, దుమ్ము వెదజల్లుతున్నాయి. పొగగొట్టాల్లోంచి విషవాయుల్ని వదులుతున్నారు. కంపెనీల కాలుష్యం వల్ల చుట్టుపక్కల ఆరు గ్రామాలు నల్లటి దట్టమైన పొగ మంచుతో కప్పినట్టుగా మారిపోయాయి. డాంబర్ ఆయిల్ బాయిల్డ్ చేయడం వల్ల ఘాటైన వాసన వస్తుండటంతో గాలి పీల్చుకునే పరిస్థితి లేదు. నిత్యం కంపెనీలకు పాత టైర్లు తీసుకువడం, డాంబర్ ఆయిల్, టైర్ల పౌడర్, ఇనుప సువ్వల్ని తీసుకెళ్లడం కోసం వందలాది లారీలు తిరుగుతున్నాయి. దుమ్ముధూళితో రోడ్లపై ప్రయాణించడం నరకప్రాయంగా మారింది.

**కాలుష్య విష కోరల్లో ఆరు గ్రామాలు**

కొండాపూర్ మండలంలోని టైర్ల కంపెనీలు వెదజల్లే కాలుష్య విషకోరల్లో ఆరు గ్రామాలు చిక్కుకున్నాయి. ఎదురుగూడెం, తేరుపోలు, గొల్లపల్లి, గుంతపల్లి, మల్లెపల్లి, గోపులారం గ్రామాల్లో కాలుష్య ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ గ్రామాల్లో గాలి, నీరు కలుషితమయ్యాయి. కంపెనీల నుంచి నిత్యం వెలువడే పొగ, దుమ్ము, ధూళీ, రసాయనాల వల్ల ప్రజలకు ఊపిరి పీల్చుకోవడమే కష్టం మారింది. తెల్లవారుజామున వదిలే దట్టమైన పొగ గాలుల్లో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుంది. స్థానికులు గాలి పీల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. దుమ్ము, పొగ వల్ల చెట్లు, పచ్చిక బయళ్లపై నల్లటి పొరగా దుమ్ము పేరుకుపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలకు మేత కరువైంది. కలుషితమైన చెట్ల ఆకులు, గడ్డి మేసిన జీవాలు కూడా వ్యాధిబారిన పడుతున్నాయి. పాలు కలుషితమవుతున్నాయని పెంపకందార్లంటున్నారు. బట్టలు, ఇతర వస్తువులు ఆరుబయట ఉంచితే వాటిపై నల్లటి పొగ, ధూళీ పడి రంగు మారుతున్నాయని మహిళలు పేర్కొంటున్నారు.

**భూగర్భ జలాలు.. పంటలు కలుషితం**

టైర్ల కంపెనీల వల్ల ఆరు గ్రామాల్లో ఏ పంట సాగు చేసినా కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా ఎదురుగూడెం, గుంతపల్లి, మల్లెపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలు, మామిడి తోటలు, వరి, పత్తి సాగు చేస్తున్నారు. కంపెనీల సమీప ప్రాంతాల్లోని రైతులు 500 ఎకరాల వరకు టమాట, వంకాయ, చిక్కుడు, బెండ, దొండ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, మునగ, మిరప, గుమ్మడి వంటి పంటలేస్తారు. మరికొందరు బంతి, చామంతీ, చాందినీ, పట్టుకుచ్చులు వంటి రకాల పూల తోటలు, పచ్చి శనగ, కుసుమ వేస్తున్నారు. పాలకూర, గోంగూర, కొత్తిమీర, పూదీన, తోట కూర సాగవుతోంది. వేలాది ఎకరాల్లో పత్తి, వరి సాగవుతుంది. సాగు చేసిన పంటలపై టైర్ల కంపెనీల నుంచి వెలువడే కాలుష్య పొగ చూరుతుంది. దాంతో పైర్లు ఆకు ముదిరి దిగుబడులు రావట్లేదు. పూత, కాయ దశలో పొగ, దుమ్ము చేరడం వల్ల రంగుమారిపోతున్నాయి. ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు, పత్తి రంగు మారడం, దుర్వాసన రావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు, కూలీలు చేళ్లల్లో పనిచేస్తే బట్టలన్నీ నల్లగా మారుతున్నాయి. చర్మ, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. 11 బీరు కంపెనీల నుంచి వ్యర్థ జలాలు వదులుతున్నారు. టైర్ల కంపెనీల రసాయన పొగ, పౌడర్ వర్షపు నీటిలో కలిసి భూమిలో ఇంకుతుంది. కాలుష్య కారక జలాలు భూగర్భంలోకి వెల్లడం వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. బోరు నీళ్లు రంగు మారి వస్తున్నాయి. కంపెనీలు రాకముందు బోర్లు, బావుల నీళ్లు తాగేందుకు వీలుగా ఉండేవి. ఇప్పుడు కనీసం వాడుకోవడానికి కూడా పనికిరావట్లేదు. వ్యర్థ జలాలు గోపులాపురం చెర్వులోకి చేరడం వల్ల ఆ చెర్వు పూర్తిగా కలుషితమైంది.

**టైర్ల కంపెనీల్ని మూసి వేయాలని ఆందోళనలు**

కొండాపూర్ మండలంలో ఉన్న 11 కాలుష్య కారక టైర్ల కంపెనీలను మూసి వేయాలని డిమాండ్ చేస్తూ రైతులు, ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో గతంలో టైర్ల కంపెనీల పొల్యూష్యన్‌పై పోరాడాయి. అధికారులు తనిఖీ చేసి కంపెనీలను మూసి వేయించారు. కొంత కాలం ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. ఇటీవల బ్యాంకు రుణాలున్నాయనే నెపంతో ఆర్నెళ్ల పాటు సమయమివ్వాలని కోరి తిరిగి నడుపుతున్నారు. మళ్లీ కంపెనీల కాలుష్యం మొదలవ్వడంతో రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పిసిబి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రమిచ్చారు.

**నీళ్లు విషపూరితమయ్యాయి: బి.చంద్రయ్య, రైతు-గుంతపల్లి**

కంపెనీల పొగ, దుమ్ము, ధూళీ వల్ల నీళ్లు, పంటలు విషపూరితమయ్యాయి. ఒకప్పుడు బోరు నీళ్లు తాగేది. ఇప్పుడు బట్టలు ఉతికి జాడిస్తే రంగు మారుతున్నయ్. నీళ్లల్లో పనిచేస్తే చర్మవ్యాధులొస్తున్నయి. రెండున్నరెకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పూలు సాగు చేస్త. గిరాకీ ఉంటది. కానీ..! రంగు మారడం వల్ల కొనట్లేదు. కొన్నా ధర రావట్లేదు. నా పొలం పక్కనే ఆరు టైర్ల కంపెనీలున్నయి. పొద్దునే ఘాటైన వాసన వచ్చే పొగను వదులుతారు. నిరంతరం నల్లటి దుమ్ము, ధూళ్లీ వస్తనే ఉంటది. పొలం పడావు పెడితే కుటుంబం గడవదు. పంటలేస్తే కాలుష్యం వల్ల నష్టపోతున్నం. టైర్ల కంపెనీలను మూసేయాలి.

### టైర్ల కంపెనీలు మూసేయాలి

కాలుష్య కారక టైర్ల కంపెనీలను మూసేయాలి. ఆరు గ్రామాల ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నయి. పొగ, దుమ్ము, ధూళీ, ఘాటైన వాసన వల్ల పర్యావరణం పాడవుతుంది.కాలుష్య కారక టైర్ల కంపెనీలను మూసి వేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం

**నర్సింహారెడ్డి,**
**రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి**

### త్వరలోనే యాక్షన్ తీసుకుంటాం

టైర్ల కంపెనీల వల్ల వెలువడే కాలుష్యం వల్ల ప్రజలకు ఇబ్బంది ఉంది. తనిఖీ చేసినం. కాలుష్య నియంత్రణ కోసం జాగ్రతలు తీసుకోవాలి. టైర్ల కంపెనీల నుంచి వెలువడే కాలుష్యం గురించి ఇప్పటికే నివేదిక ఇచ్చాం. రాష్ట్ర స్థాయి అధికారుల పరిశీలనలో ఉంది. త్వరలోనే యాక్షన్ తీసుకుంటాం.

**గీత సపారే,ఇఇ - పిసిబి, సంగారెడ్డి**



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్ తమిళి సై

## ఔషధ పంటలపై పరిశోధనలు విస్తృతం చేయాలి

- చాన్స్‌లర్ గవర్నర్, డాక్టర్ తమిళి సై సౌందరరాజన్
- కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో రెండో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'దేశ సంస్కృతిలో భాగమైన పండ్లు, కూరగాయలు, పూలు.. లాంటి ఔషధ పంటలపై పరిశోధనలు విస్తృతం చేయాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. విద్యార్థులు వ్యవసాయం, ఉద్యాన కోర్సులను ఎంచుకోవడం ద్వారా దేశానికి సేవ చేయడానికి ముందుకు వస్తున్నారన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పండ్లు, కూరగాయలు, పూల ఉత్పత్తిలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించాలన్నారు. సమతుల ఆహారంలో కూరగాయలు, పండ్లు ముఖ్యమన్నారు. కోవిడ్ సమయంలో పౌష్టికాహారం గురించి ఎన్నో నేర్చుకున్నామని గుర్తుచేశారు. అందమైన వనాల రూపకల్పనలో ఉద్యాన పట్టభద్రుల కృషి అవసరమన్నారు. ఉద్యాన పంటల సాగు, మార్కెటింగ్, ఎగుమతుల్లో వృద్ధి కనిపిస్తుందన్నారు. తమిళనాడులో రకరకాల బియ్యం అందుబాటులో ఉన్నాయని, తెలుగు నేలపై పాలిష్ రైస్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. బియ్యం తగ్గిస్తూ ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు, పండ్లు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం భారత వ్యవసాయ పరిశోధన మండలి హార్టికల్చరల్ సైన్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆనంద్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. పర్యావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయ ఉద్యాన పంటల ఉత్పత్తి, నాణ్యత పెంచడంలో శాస్త్ర సాంకేతికత భాగస్వామ్యం అవసరమని చెప్పారు. మార్కెట్ ఉన్న పంటల సాగు చేయడం, కోతానంతరం వ్యవసాయ నష్టాలను తగ్గించడంతో పాటు రోబోటిక్స్, డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జీనోమ్ ఎడిటింగ్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించుకోవాలని చెప్పారు. తక్కువ వనరులతో ఎక్కువ ఉత్పాదకత సాధించడమే లక్ష్యంగా వ్యవసాయ అనుబంధ రంగాలలో పరిశోధనలు ముమ్మరం కావాలని కోరారు. వర్సిటీ అభివృద్ధి నివేదికను యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్ నివేదించారు. యూనివర్సిటీ ఏర్పాటు చేసిన అనతికాలంలోనే విద్యా, పరిశోధన, విస్తరణలో అనేక విజయాలు సాధించిందన్నారు. భవిష్యత్తులో రైతులకు నికర లాభాలు అందించే పరిశోధనలు, టెక్నాలజీల అభివృద్ధి చేస్తామని చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉప కులపతిగా నియమించినందుకు సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు.



## వ్యకాస బహిరంగ సభా స్థలిని పరిశీలించిన తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా ఈ నెల 29న ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్‌లో నిర్వహించే బహిరంగ సభాస్థలిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని శుక్రవారం పరిశీలించారు. ఈ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరన్ విజయన్ హాజరుకానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు సుమారు లక్ష మంది వచ్చే అవకాశాలు ఉండడంతో దానికి తగిన రీతిలో ఏర్పాట్లు ఉండాలని తమ్మినేని వ్యకాస నాయకులకు సూచించారు. సభా ప్రాంగణంలో వేదిక ఎటువైపు, ఎలా ఉండాలి? అనే అంశాలపై పార్టీ నేతలతో గ్రౌండ్‌లోనే కొద్దిసేపు ముచ్చటించారు. బహిరంగ సభ ముఖ్య అతిథి కేరళ సిఎంకు భద్రత కల్పించేలా పోలీసులను సంప్రదించాలన్నారు. సభా స్థలిని పరిశీలించిన వారిలో.. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, తదితరులు ఉన్నారు.

## దేహదారుఢ్య పరీక్షలను పాతపద్ధతిలోనే నిర్వహించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీస్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎత్తు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, పరుగుకు సంబంధించిన అర్హత మీటర్లను పెంచడంతో చాలా మంది ఎంపికయ్యే అర్హతను కోల్పోతున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. అందువల్ల పాతపద్ధతిలోనే దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం అభ్యర్థులకు వివిధ రకాల పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దేహదారుఢ్య పరీక్షలో భాగంగా 3.80 మీటర్లుగా ఉన్న లాంగ్‌జంప్ దూరాన్ని నాలుగు మీటర్లకు పెంచారని తెలిపారు. 5.6 మీటర్లుగా ఉన్న షాట్‌పుట్‌ను ఆరు మీటర్లకు పెంచారని పేర్కొన్నారు. 800 మీటర్లుగా ఉన్న పరుగును 1,600 మీటర్లకు పెంచారని వివరించారు. దీనికి తోడు డిజిటల్ పద్ధతి ద్వారా ఎత్తు కొలవడంతో సాంకేతిక లోపం వల్ల చాలా మంది అభ్యర్థులు ఎంపికయ్యే అర్హతను కోల్పోతున్నారని తెలిపారు. కాబట్టి పాత పద్ధతిలోనే లాంగ్‌జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లను నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరుగు అనంతరం రెండు గంటలు లేదా ఒక రోజు సమయమిచ్చి లాంగ్‌జంప్, షాట్‌పుట్ వంటి ఇతర పరీక్షలను నిర్వహించాలని కోరారు. పాత నోటిఫికేషన్‌లో కమ్యూనికేషన్, ఫైర్‌మెన్, సివిల్ విభాగాల్లో బెస్ట్ ఆఫ్ టూ ఈవెంట్స్‌ను అమలు చేయాలంటూ పేర్కొన్నారని గుర్తు చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి వేర్వేరుగా ఈవెంట్లను నిర్వహించాలని తెలిపారు. లాంగ్‌జంప్‌లో ఆన్ ద లైన్ జంప్‌ను అనుమతించాలని పేర్కొన్నారు. డిజిటల్ విధానాన్ని తీసేసి, పాత పద్ధతినే మ్యానువల్‌గా అభ్యర్థుల ఎత్తు, కొలతలను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## ఒమిక్రాన్ బిఎఫ్7 ప్రాణాంతకం కాదు

- ఎఐజి చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒమిక్రాన్ బిఎఫ్7 సబ్ వేరియంట్ ప్రాణాంతకం కాదని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చైర్మన్ డా. నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. బిఎఫ్7 సబ్ వేరియంట్ దేశంలోకి ప్రవేశించిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహా రాష్ట్రాలన్నీ అప్రమత్తమవుతున్నాయని తెలిపారు. "చైనాలో వచ్చినంత ఎక్కువగా భారత్‌లో కొవిడ్ కొత్త కేసులు వచ్చే అవకాశం లేదు. చైనాలో ఇచ్చిన వ్యాక్సిన్‌లు తక్కువ నాణ్యత కలిగినవి. చైనా ఇటీవలి వరకు జీరో కొవిడ్ విధానాన్ని పాటించింది. ఇటీవలే అక్కడ కొవిడ్ నిబంధనలు సడలించారు. అందుకే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. భారత్‌లో అక్టోబరులోనే ఈ బిఎఫ్7 కేసులు వెలుగు చూశాయి.. కానీ పెద్దగా ప్రభావం చూపలేదు. బీఎఫ్7 ఒక్కరి నుంచి 10మందికి వ్యాపిస్తుంది. భారత్‌లో వస్తున్న కొవిడ్ కేసులలో 80శాతం ఎక్స్ బిబి రకానివే. బూస్టర్ డోస్‌గా ఒకే రకం వ్యాక్సిన్‌కి బదులుగా భిన్నమైన వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది. కొవిడ్ బిఎఫ్7 ప్రాణాంతకం కాదు. వచ్చే మూడేళ్ల వరకు ఏటా బూస్టర్ డోస్ తీసుకోవడం మంచిది" అని నాగేశ్వర్‌రెడ్డి వివరించారు.

## లక్ష స్కూటర్లలో ఒలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్

బెంగళూరు : ఒలా ఎలక్ట్రిక్ దేశంలోని తన ఒక లక్షకు పైగా వినియోగదారుల స్కూటర్లలోని సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నట్లు పేర్కొంది. 50కి పైగా ఫీచర్స్, పనితీరు మెరుగుదల కోసం మోవ్‌ఒఎస్ 3ని ఎస్1 స్కూటర్లలో రోల్‌ఔట్‌ను ప్రకటించింది. ఇది అతిపెద్ద నవీకరణ అని, ఒక్క ఏడాది గడిచేలోగా ఇది తమ మూడో భారీ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అని ఒలా ఎలక్ట్రిక్ ఫౌండర్ భవీష్ అగర్వాల్ పేర్కొన్నారు.




## ఏడాదిలో 20వేల స్క్రీన్లు లక్ష్యం

- బెల్ ప్లస్ మీడియా వెల్లడి

ప్రజాశక్తి-హైదరాబాద్

ఔట్‌డోర్ డిజిటల్ ప్రకటనల రంగంలో భారీ విస్తరణ లక్ష్యాలు పెట్టుకున్నట్లు బెల్ ప్లస్ మీడియా వెల్లడించింది. కంపెనీ ఏర్పాటైన రెండేళ్లలోనే దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో 3,200 పైచిలుకు స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి 200 నగరాల్లో 20,000 స్క్రీన్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బెల్ ప్లస్ మీడియా సహ వ్యవస్థాపకులు గాయత్రి రెడ్డి, దేవ్ అభిలాష్ రెడ్డి తెలిపారు. దేశంలో తొలిసారిగా రెండు డిస్‌ప్లేలతో స్క్రీన్లను ఏర్పాటు చేసిన ఘనత తమదేనన్నారు. ఇటీవల నెలరోజుల్లోనే పది కాంట్రాక్టులు సాధించామన్నారు. ఈ ఏడాది మార్చిలో రూ.7.5 కోట్ల సీడ్ ఫండ్‌ను సమీకరించామని.. రెండవ రౌండ్ ద్వారా త్వరలోనే నిధులు సమీకరిస్తామన్నారు.

## అశుద్ధ భారతం అమాన వీయతకు దర్పణం

ప్రజాశక్తి -కల్చరల్

ప్రపంచంలోనే అత్యున్నత ప్రజా స్వామ్య దేశంగా చెప్పుకునే భారత్‌లో అశుద్ధం ఎత్తే వ్యక్తుల వుండటం సొచనీయమని రచయిత్రి సజయ అన్నారు హైద్రాబాద్ బుక్ ఫెయిర్‌లో శుక్రవారం ఆలి శెట్టి ప్రభాకర్ వేదికపై గ్రంధలపై చర్చగోష్ఠిలో భాగంగా సజయ రచించిన 'అశుద్ధ భారతం'పై ప్రొఫెసర్ సముల్లతతో చర్చించారు. భాషా సింగ్ దేశమంతా తిరిగి అస్పృశ్య భారత్‌ను హిందీలో రచించగా, రీతూ తల్వార్ ఆంగ్లములోకి అనువదించారని, తాను తెలుగులోకి ఎందరినో కలసిన తర్వాత తన అనుభవాలతో కలిపి అనువాదం చేశానని తెలిపారు. పాకీ పని వృత్తి కాదని సమాజం అణచివేత వల్ల వారు ఈ పనికి నెట్టబడ్డరని అన్నారు. వారికి పేరున్నా అమ్మ అనే పిలుస్తారని సజయ తెలిపారు పాకీ వారిపై అంబెద్కర్, గాంధీల ఆలోచన విరుద్ధంగా ఉండేవని వివారించారు ప్రస్తుత ప్రధాని మోడీవిధానాలు ఈ పనిని నిలుపు చేసేలా లేవని అందుకే డ్రైనేజ్ శుభ్రం పరిచేవారు మమ్ము చంపకండి అని నినదిస్తున్నారని తెలిపారు. సాహిత్యం ద్వారానే ఇట్టి అమాన వీయ పరిస్థితిలు వెలుగులోకి తేవచ్చని అన్నారు. ముగింపుగా పాకీ పని నిర్మూలనకు బెజవాడ విల్సన్ చేపట్టిన ఉద్యమనికి సాంఘీ భావం ప్రకటించారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు కార్యక్రమం నిర్యాహించారు.

## ఖమ్మం సభతో బిఆర్‌ఎస్‌లో వణుకు : టిడిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం సభతో బిఆర్‌ఎస్ నాయకుల వెన్నులో వణుకు పుట్టిందని టిడిపి ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, తెలుగు మహిళ అధ్యక్షురాలు టి జ్యోత్స్న అన్నారు. ఖమ్మంలో చంద్రబాబు షో చేశారని మంత్రి హరీష్‌రావు మాట్లాడటం సరికాదన్నారు. ఉద్యమ సమయంలో అగ్గిపెట్టే షో వల్ల 12 వందల కుటుంబాలకు చెందిన పిల్లలు చనిపోలేదా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్‌భవన్‌లో శుక్రవారం మీడియాతో సంయుక్తంగా మాట్లాడుతూ ఆ కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం , మూడు ఎకరాల భూమి, రూ. పది లక్షల పరిహారం పరిహారం ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకూ ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కనీసం అమరవీరుల కుటుంబాలను ఏనిమిదేళ్ల కాలంలో ఆదుకోని మీరు, చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత ఉందా ? అని అడిగారు. మావోయిస్టుల ఎజెండానే మా ఎజెండా అని మాట్లాడిన బిఆర్‌ఎస్ పార్టీ, మావోయిస్టులకు ఎందుకు టికెట్లు ఇవ్వలేదని అన్నారు. నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు బిఆర్‌ఎస్ దుర్మార్గ పాలనలో జరిగిన విషయం మరిచిపోయారా? అని అన్నారు. మీ నాయకుడు తుపాకీ రాముడిలా తమ నాయకుడు ఎప్పుడూ మాట్లాడరని, చంద్రబాబు చెప్పిందే చేస్తారు, చేసిందే చెప్తారని అన్నారు. నల్లగొండ జిల్లాలో ఎఎంఆర్ ప్రాజెక్టు ద్వారా 2004 లోపే 506 గ్రామాలకు కృష్ణా జలాల ద్వారా తాగు నీటిని అందించిన చరిత్ర అందరికి తెలిసిన ముచ్చటేనని వ్యాఖ్యానించారు. దీనిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ చేశారు. గత ఐదేండ్ల కాలంలో 3055 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. సెంటిమెంటు కాలం చెల్లిందని, టిఆర్‌ఎస్ నుంచి బిఆర్‌ఎస్‌గా మారినంత మాత్రాన మీ పాపాలు మాసిపోవని అభిప్రాయపడ్డారు.

# రైతాంగ సంక్షేమంలో తెలంగాణది స్వర్ణయుగం

- వ్యవసాయ రంగాభివృద్ధితో గ్రామీణాభివృద్ధి
- కేంద్రం అవరోధాలను అధిగమించి రైతు సంక్షేమం అమలు
- కిసాన్ దివస్ సందర్భంగా సిఎం కెసిఆర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఏర్పడిన ఎనిమిదేళ్ల స్వల్పకాలంలోనే, వ్యవసాయరంగ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వినూత్న విధానాలు, దేశ రైతాంగ సంక్షేమంలో స్వర్ణయుగానికి బాటలు వేసిందని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు తెలిపారు. "జాతీయ రైతు దినోత్సవాన్ని" (కిసాన్ దివస్ ) పురస్కరించుకొని సిఎం కెసిఆర్ రాష్ట్ర, దేశ రైతాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులకు నేటి స్వరాష్ట్రంలోని రైతు సంక్షేమం వ్యవసాయం పరిస్థితులకు హస్తిమశకాంతరం వున్నదన్నారు. వ్యవసాయరంగం పై ఆధారపడి జీవిస్తున్న రైతుల జీవితాలను గుణాత్మక దిశగా అభివృద్ధి పరిచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు అత్యద్భుత ఫలితాలనిస్తున్నాయన్నారు. మునుపెన్నడూ లేని రీతిలో.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఆ తర్వాత అనేంతగా దేశ వ్యవసాయరంగం ప్రగతిని సాధించిందని సిఎం కెసిఆర్ తెలిపారు. దండుగలా మారిన తెలంగాణ వ్యవసాయ రంగాన్ని నేడు పండుగలా మార్చడంతో పాటు, నేడు దేశానికే అన్నపూర్ణగా, సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ అవతరించడం వెనుక ఎంతో శ్రమ, మేధో మథనం దాగి ఉన్నదని సిఎం తెలిపారు. ప్రగతి పథంలో దూసుకుపోతున్న తెలంగాణకు అడుగడుగునా అడ్డుపుల్ల వేస్తూ, కేంద్రం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను విస్మరించి, తెలంగాణకు ఆర్థికపరమైన అడ్డంకులు సృష్టిస్తున్నా, లెక్కచేయకుండా మొక్కవోని పట్టుదలతో అడ్డంకులను అధిగమిస్తూ రైతుల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. రైతుబంధు పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని సిఎం కెసిఆర్ పునరుద్ఘాటించారు. వ్యవసాయరంగంలో సాధించే ప్రగతి సమస్త రంగాలకు చోదకశక్తిగా పనిచేస్తుందని, తద్వారా మాత్రమే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని సిఎం తెలిపారు. వ్యవసాయరంగంలో అభివృద్ధిని సాధించడం ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలు పటిష్టమై గ్రామీణార్థిక వ్యవస్థ బలోపేతమౌతుందని, అది "స్పిన్ ఆఫ్ ఎకానమి" కి దారి తీసి తద్వారా సుస్థిరాభివృద్ధి' జరుగుతుందని సిఎం అన్నారు.

ప్రాథమికరంగమైన వ్యవసాయరంగంలో చోటు చేసుకునే ప్రగతి ద్వారా, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగుతుందని, దాని ప్రభావం, ద్వితీయ, తృతీయరంగాలయిన పరిశ్రమలు తదితర ఉత్పత్తి రంగాలకు, సేవారంగాలకు విస్తరిస్తుందని సిఎం వివరించారు. ఇదే సూత్రాన్ని అనుసరించి సమస్త రంగాల్లో వృద్ధిరేటు వూహించని రీతిలో నమోదవుతూ, అటు తలసరి ఆదాయం, ఇటు జిఎస్‌టిపి పెరుగుదలకు దోహదం చేసిందన్నారు. విద్యుత్తు, వ్యవసాయం, సాగునీటి రంగంతోపాటు పలు వృత్తుల అభివృద్ధికోసం తెలంగాణ ప్రభుత్వం వెచ్చించే ఖర్చు, సామాజిక పెట్టుబడిగా పరిణామం చెందుతుందనే శాస్త్రీయ ఆర్థిక విధానాన్ని తన కార్యాచరణ ద్వారా తెలంగాణ ప్రభుత్వం నిరూపించిందన్నారు. తెలంగాణ అనుసరిస్తున్న ఇటువంటి రైతు సంక్షేమ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఫలితాలను సాదిస్తున్న తెలంగాణ స్ఫూర్తితో దేశంలో కిసాన్ సర్కార్ అధికారంలోకి రావాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. తెలంగాణ మోడల్ ద్వారా మాత్రమే దేశ రైతాంగం, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు అసలైన పరిష్కారం లభిస్తుందని పునరుద్ఘాటించారు.

**మృతిచెందిన జవాన్ల కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలి...**

నార్త్ సిక్కింలోని జైమా వద్ద, విధి నిర్వహణలో వున్న ఆర్మీ జవాన్లు అధికారులు ప్రయాణిస్తున్న వాహనం, ప్రమాదవశాత్తూ లోయలో పడిన ఘోర ప్రమాదంలో, ప్రాణ నష్టం జరగడం పలువరు తీవ్రంగా గాయపడడం పట్ల సిఎం కెసిఆర్ దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో 16 మంది జవాన్లు మృతి చెందడం పట్ల సిఎం కెసిఆర్ సంతాపం ప్రకటించారు. ఆర్మీ జవాన్లు అధికారుల కుటుంబాలకు సిఎం కెసిఆర్ తన సానుభూతిని తెలిపారు. మృతి చెందిన జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలని, క్షతగాత్రులకు తగు విధంగా వైద్యసేవలందించాలని కేంద్రాన్ని కోరారు.



## కేంద్రం వ్యాఖ్యలపై ఆగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్‌ఎస్ శ్రేణుల నిరసన
- కేంద్రం, ప్రధాని దిష్టిబొమ్మల దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టం నిధులతో తెలంగాణ ప్రభుత్వం పంట ఆరబోత కల్లాలు నిర్మించడంపై కేంద్ర ప్రభుత్వ వ్యాఖ్యలను నిరసిస్తూ బిఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులపై కేంద్రం కక్షపూరిత విధానాలను నిరసిస్తూ ధర్నాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. వ్యవసాయానికి ఉపాధిహామీ చట్టాన్ని అనుసంధానించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. కల్లాల నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో మహాధర్నా నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో వాణిజ్య భవన్ వద్ద, యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ధర్నా చేశారు.

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో బిఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేశారు. సాగర్ రహదారిపై ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.

బిఆర్‌ఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నదాతలతో కలిసి మేడ్చల్ పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. పంట కల్లాలకు ఉపయోగించిన ఉపాధి నిధులను వెనక్కి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గోషామహల్‌లో కుంగిన నాలా పైకప్పు


- ధ్వంసమైన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు
- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని గోషామహల్ చాక్నవాడిలో పెద్ద ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా నాలా పైకప్పు కుంగిపోవడంతో రోడ్డు పక్కన, ఇండ్ల ముందు ఉన్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు అందులోకి పడిపోయాయి. ప్రతి శుక్రవారం అక్కడ కూరగాయల అంగడి కొనసాగుతున్నది. కూరగాయల వ్యాపారులు అప్పుడప్పుడే అక్కడకు చేరుకుంటుండగా.. కొందరేమో కూరగాయల బండ్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా నాలా కుంగిపోయింది. పలువురు పడిపోవడంతో వారికి గాయాలయ్యాయి. అయితే, రద్దీ తక్కువగా ఉండటంతో ప్రాణహాని జరగలేదు. ఎన్నో ఏండ్ల నిర్మాణం గల నాలాపై ఉన్న రోడ్డు కుంగిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నాలాలను వదలకుండా ఆక్రమించుకుంటున్న వైనం, మరోపక్క నాలాలపైనే నిర్మాణాలు కొనసాగించడం.. భారీ వాహనాల లోడింగ్‌లు, అన్‌లోడింగ్‌లే నాలా కుంగిపోవడానికి కారణంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న షాహినాయత్ గంజి ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ సిబ్బందితో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మార్కెట్‌కు వచ్చే జనాలను, స్థానికులను అక్కడి నుంచి తరలించారు. గోషామహల్ ఏసీపీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

**నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్లే :మంత్రి తలసాని**

నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చాక్నావాడిలో ఘటనా స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.



కూలిపోయిన నాలా

**అక్రమ గోడౌన్‌లు : జాంబాగ్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ గౌడ్**

నాలాపై రోడ్డు కుంగిపోవడానికి ముఖ్య కారణం అక్రమ గోడౌన్ల నిర్మాణమేనని బిఆర్‌ఎస్ జాంబాగ్ డివిజన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

ప్రతిరోజూ ఇక్కడికి పెద్ద పెద్ద లారీలు ఎక్కువ లోడ్‌తో తిరుగుతున్నాయన్నారు. ఇక్కడ ప్లైవుడ్ బండ్లు, వివిధ మెటీరియల్ బండ్లు రోజుకు 10 నుంచి 25 చొప్పున అన్‌లోడ్ అవుతున్నాయని చెప్పారు. 40 సంవత్సరాల కింద వేసిన రోడ్డు కావడం.. లారీల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో రోడ్డు కుంగిపోయిందన్నారు. సంబంధిత అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## నారాయణమ్మ కాలేజీలో రక్తదాన శిబిరం

హైదరాబాద్ : షేక్‌పేటలోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి విశేష స్పందన లభించిందని ఆ విద్యా సంస్థ తెలిపింది. 100 మంది పైగా విద్యార్థినీలు, సిబ్బంది రక్తదానం చేశారని పేర్కొంది. రక్తదాతలను కళాశాల ఛైర్మన్ పి.సుబ్బారెడ్డి, ట్రస్టీ జి.ఏకాంబర రెడ్డి, ప్రిన్సిపల్ కె రమేష్ రెడ్డి అభినందించారు.




## పేదలకు కెనరా బ్యాంక్ సాయం

హైదరాబాద్ : క్రిస్మస్ పండగ సందర్భంగా కెనరా బ్యాంక్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఓ కార్యక్రమాన్ని చేపట్టింది. సికింద్రాబాద్‌లోని కుందన్‌బాగ్‌లో 'సిస్టర్ ఫర్ చారిటీ'తో కలిసి 100 మందికి పైగా పేదలకు బియ్యం, పప్పులు, ఆయిల్‌ను అందించింది. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీసు-2 హైదరాబాద్ డిజిఎం ఎం విజయ కుమార్, కుందన్‌బాగ్ శాఖ చీఫ్ మేనేజర్ రాజ్ కుమార్, ఆర్ఒ ఎఎఫ్అండ్‌పిఎస్ సెక్షన్ ఇంచార్జీ పి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## మాకు రక్షణ కల్పించండి

### ప్రజా బహిరంగ విచారణ సదస్సులో దళిత బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ భూములను అన్యాక్రాంతం చేసి హత్యాయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు పట్టించుకోవడం లేదనీ, రక్షణ కల్పించి తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బహుజన ఫ్రంట్,(డిబిఎఫ్), తెలంగాణా వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, జాతీయ అత్యాచారాల నిరోధక ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార సవరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలనీ, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ ఛైర్మెన్, సభ్యులను నియమించాలని, ముఖ్యమంత్రి అధ్యక్షతన హైపవర్ కమిటీ వేసి దాడులను ఆరికట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర స్థాయి ప్రజా బహిరంగ విచారణ సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార బాధితులు తమ గోడు వినిపించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ.. ఎస్‌సి,ఎస్‌టిపై జరుగుతున్న దాడుల గురించి ఈ నెల 13న లోకసభ సభ్యులు ఎ.ఎం. ఆరీఫ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం మంత్రి అజయ్ కుమార్ మిశ్రా సమాధానం చెబుతూ 2018 నుండి 2021 వరకు ఎస్‌సి,ఎస్‌టిలపై జరిగిన దాడుల వివరాలను తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2018లో 1,926, 2019లో 2,220, 2020లో 2,532, 2021లో 2,283 మొత్తం 8,962 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 2022 జూన్ వరకు 1,155 ఎస్‌సి,ఎస్‌టి కేసులు నమోదైయ్యాయని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. దళిత, గిరిజన తరగుతులపై రోజురోజుకు దాడులు పెరగడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌పిపిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాం ప్రసాద్ మాట్లాడుతూ...ఎస్‌సి, ఎస్‌టి చట్టం పట్ల రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిదేండ్లుగా ఉద్దేశ పూర్వకంగానే నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తోందని విమర్శించారు. ఈ సదస్సులో సీనియర్ నాయకులు జి.శంకర్, బాలకృష్ణ, టివివియు రాష్ట్ర అధ్యక్షుడు యం.వెంకటయ్య, నాగయ్య, నఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.గంగన్న, డిబిఎస్‌యు నాయకులు నర్సింహ్మ, పిఎంసి నాయకులు శివలింగం, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తదితరులు మాట్లాడారు.

## ఆలస్య రుసుముతో ఇంటర్ ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2023 మార్చిలో జరిగే వార్షిక పరీక్షల ఫీజు ఆలస్య రుసుం రూ.వెయ్యితో చెల్లింపునకు ఈనెల 28 వరకు గడువుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే షెడ్యూల్ ప్రకారం ఆలస్య రుసుం రూ.వెయ్యితో ఈనెల 22 వరకు ఫీజు చెల్లించేందుకు గడువు ముగిసింది. శుక్రవారం నుంచి రూ.ఐదు వేలతో ఈనెల 28వ తేదీ వరకు అవకాశముందంటూ గతంలోనే ఇంటర్ బోర్డు ప్రకటించింది. అయితే తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం (టిపిజెఎంఎ) విజ్ఞప్తి మేరకు ఆలస్య రుసుం రూ.వెయ్యితో ఈనెల 28 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశమిస్తున్నట్టు నవీన్ మిట్టల్ తెలిపారు. కాలేజీల ప్రిన్సిపళ్లు ఈనెల 28 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతోపాటు ఫెయిలైన వారి నుంచి ఫీజు తీసుకోవాలని కోరారు.

# వైవిధ్యమైన నటుడు కైకాల

- నవరస నట సార్వభౌముడిగా చెరగని ముద్ర
- సత్యనారాయణ మరణం పట్ల సిఎం కెసిఆర్ సంతాపం
- భౌతికకాయానికి నివాళి, కుటుంబ సభ్యులకు పరామర్శ
- గవర్నర్, పలువురు మంత్రులు, రాజకీయ నేతల సంతాపం
- సినీ రంగానికి తీరని లోటు : తమ్మినేని



కైకాల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సినీ నటుడు కైకాల సత్యనారాయణ మరణం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తన వైవిధ్యమైన నటనతో ఆయన సినీ అభిమానుల హృదయాల్లో నవరస నట సార్వభౌముడిగా చెరగని ముద్ర వేశారని తెలిపారు. చలన చిత్ర రంగంలో తొలితరం నటుడిగా పలు విభిన్నమైన పాత్రలను పోషించిన ఆయన... మూడు తరాల ప్రేక్షకుల అభిమానాన్ని పొందారని స్మరించుకున్నారు. సత్యనారాయణతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నటుడిగా, లోక్‌సభ సభ్యుడిగా ఆయన అందించిన కళాసేవ, ప్రజాసేవ గొప్పదని కొనియాడారు. కైకాల మరణం తెలుగు చిత్రరంగానికి తీరనిలోటని సిఎం విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కైకాల ఇంటికి వెళ్లిన కెసిఆర్.. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి... వారికి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కైకాల అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. సిఎం వెంట కైకాల నివాసానికి వెళ్లిన మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, బాల్క సుమన్ తదితరులు కూడా సత్యనారాయణ భౌతిక కాయానికి నివాళు లర్పించారు.

రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ కైకాల మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలుగు చిత్ర రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని నివాళులర్పించారు. సుమారు 60 ఏండ్లపాటు పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో తనదైన నటించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న కైకాల మరణం సినీ రంగానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టరేట్‌తోపాటు ఎన్నో అవార్డులను అందుకున్న సత్యనారాయణ నటుడిగా, మచిలీపట్నం ఎంపిగా ప్రజలకు సేవలందించారని నివాళులర్పించారు. కైకాల మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకరరావు, ఎంపి రవిచంద్ర, పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు కైకాల మరణం పట్ల సంతాపాన్ని ప్రకటించారు.

## స్టాన్‌ప్లస్‌తో కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యం

ప్రజాశక్తి -హైదరాబాద్

మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాట్ ఫామ్ అయిన స్టాన్ ప్లస్‌తో హైదరాబాద్‌కు చెందిన కేర్ హాస్పిటల్స్ గ్రూప్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా బంజారాహిల్స్, నాంపల్లి, మలక్ పేట, హైటెక్ సిటీ, ముషీరాబాద్ శాఖల్లో ఒక్కో ఎఎల్ఎస్ అంబులెన్సుతో పాటు కేర్ హాస్పిటల్స్ బంజారాహిల్స్ అవుట్ పేషెంట్ సెంటర్‌లో మరో ఎఎల్ఎస్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు కేర్ హాస్పిటల్స్ పేర్కొంది. స్టాన్ ప్లస్ తన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, తక్షణ స్పందన వ్యవస్థ, శిక్షణ పొందిన పారామెడికల్ సిబ్బంది ద్వారా క్లిష్టమైన పరిస్థితిలో ఉన్న రోగులను సకాలంలో చేరుకోగలదని విశ్వాసం వ్యక్తం చేసింది. "అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మా అంబులెన్సుల ద్వారా హైదరాబాద్ అంతటా ఎనిమిది నిమిషాల అంచనా సమయం ద్వారా ఉత్తమ ప్రీ-హాస్పిటల్ చికిత్సలను అందించాలన్న మా ఘనమైన లక్ష్యాన్ని సాధించడానికి కేర్ ఆస్పత్రితో భాగస్వామ్యం దోహదం చేయనుంది." అని స్టాన్‌ప్లస్ సిఇఒ ప్రభ్‌దీప్ సింగ్ పేర్కొన్నారు.

### ఆర్‌టిసిలోకి

## కొత్త సూపర్ లగ్జరీ బస్సులు

- నేడు ప్రారంభించనున్న రవాణాశాఖ మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఆర్టీసిలో పాతబస్సుల స్థానంలో రీప్లేస్‌మెంట్ కింద 1,016 సూపర్ లగ్జరీ కొత్త బస్సులు ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గాను రూ.392 కోట్ల వ్యయంతో అధునాతనమైన ఈ బస్సుల్ని కొనుగోలు చేస్తున్నారు. వీటిలో మొదటి విడతగా 630 సూపర్ లగ్జరీ, 130 డీలక్స్, 16 స్లీపర్ బస్సులను టెండర్ల ద్వారా కొనుగోలుకు టిఎస్ఆర్‌టిసి ఆర్డర్లు ఇచ్చింది. ఈ బస్సులన్నీ 2023 మార్చి నాటికి పూర్తిగా అందుబాటులోకి వస్తాయి. వీటిలో కొన్ని బస్సులను శనివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పైన రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించనున్నారు. ఈ బస్సుల్లో పూర్తిస్థాయి అధునాతన సాంకేతిక ఫీచర్లు ఉన్నాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా బస్సుల్లో ట్రాకింగ్ సిస్టం, ప్యానిక్ బటన్ సదుపాయం ఉంటాయి. ఇవి ఆర్‌టిసి కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి ఉంటాయి.




ప్రయాణికులకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే పానిక్ బటన్‌ను నొక్కగానే టిఎస్ఆర్‌టిసి కంట్రోల్ రూంకు సమాచారం అందుతుంది. దీనివల్ల అధికారులు వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటారు. ప్రతి బస్సులోనూ సౌకర్యవంతమైన 36 రిక్లైనింగ్ సీట్లున్నాయి. ఎల్ఇడి డిస్ ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే సెక్యూరిటీ కెమెరాలు ఉంటాయి. రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరానూ ఉంటుంది. అత్యాధునికమైన ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టం (ఎఫ్‌డిఎఎస్) ఉంటుంది. బస్సులో మంటల చెలరేగగానే వెంటనే ఇది అప్రమత్తం చేస్తుంది. ఉష్ణోగ్రత పెరిగినా అలారం ఆటోమెటిక్‌గా మోగుతుంది. సెల్ ఫోన్ ఛార్జింగ్ సదుపాయం, వినోదం కోసం టీవీలు ఉంటాయి.